

పోలీసుల సంక్షేమం దిశగా చర్యలు
పోలీసు సిబ్బంది తల్లిదండ్రుల సంక్షేమానికి ప్రతి మండలంలో సంక్షేమ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు.
- 8లో..



ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలి
వీధి వ్యాపారులు ఫుడ్ సేఫ్టీ పాటించాలని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు.
- 8లో..

గరిష్టం/కనిష్టం
38 /31

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దర్శిలో కలెక్టర్ స్పందన

ఒంగోలు అర్బన్: ప్రతి సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యాక్రమం సోమవారం దర్శిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. దర్శిలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న శ్రీనివాస పద్మావతి కళ్యాణ మండపంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. దీనికి జిల్లా అధికారులంతా హాజరవుతారని, నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలను తెలియజేయాలని పేర్కొన్నారు.

తొలి విడతలో 272 మందికి అక్రిడిటేషన్ కార్డులు

ఒంగోలు అర్బన్: జిల్లాలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు సంబంధించి 2023–24 సంవత్సరాలకు తొలి విడతలో 272 మందికి అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసినట్లు కలెక్టర్, మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. శనివారం ప్రకాశం భవనంలో మంజూరైన అక్రిడిటేషన్ కార్డులను జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న వివిధ మీడియాల ప్రతినిధులకు అందజేశారు. అర్హులైన అందరికీ అక్రిడిటేషన్‌లు జారీ చేస్తామని కార్డు మంజూరు కాని వారు రాష్ట్ర సమాచార శాఖ వెబ్‌సైట్‌లో వివరాలను అప్‌లోడ్ చేసి సంబంధిత ధ్రువపత్రాలను జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

మార్కాపురం: పట్టణంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధికి మార్కాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు తడికమళ్ల బాల సుబ్బారావు శనివారం రూ.1,00,116 ను దేవస్థానం చైర్మన్ పెనుగొండ కేశవరావుకు అందజేశారు. ప్రస్తుతం ఆలయంలో నాలుగు వైపులా రాజగోపురాల నిర్మాణం జరుగుతోంది. తానిచ్చిన నగదును రాజగోపురాల నిర్మాణానికి ఖర్చుపెట్టాలని సుబ్బారావు కోరారు.

డెంగీ నివారణ మాసోత్సవాలు నిర్వహించాలి

ఒంగోలు అర్బన్: డెంగీ నివారణ మాసోత్సవాలు ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు విజయవంతంగా నిర్వహించి డెంగీ నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఆర్‌ఓ శ్రీలత సంబంధిత అధికారులకు సూచించారు. ప్రకాశం భవనంలో డెంగీ నివారణ మాసోత్సవాలపై సమావేశం నిర్వహించి సంబంధించి పోస్టర్‌ను డీఆర్‌ఓ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల వృద్ధి అధికంగా ఉంటుందని, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేను నిర్వహించాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం లక్ష్యాలను సాధించేలా చిత్తశుద్ధితో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దీనిలో మలేరియా నివారణ అధికారి జ్ఞానశ్రీ, డీసీహెచ్ఎస్ మూర్తి, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్‌నాయక్, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు పాల్గొన్నారు.

3న ఎస్వీఆర్ జయంతి వేడుకలు

ఒంగోలు టౌన్: మహానటుడు ఎస్వీ రంగారావు జయంతి వేడుకలు ఈ నెల 3వ తేదీ ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూంలో రావు సాహెబ్ వరద శ్రీరాములు నాయుడు కళా ప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఈ వేడుకల కరపత్రాన్ని ట్రాఫిక్ డీఎస్పీ విక్రం శ్రీనివాసరావు శనివారం ఆవిష్కరించారు. పౌరాణిక పాత్రలకు ప్రాణప్రతిష్ఠ చేసిన మహానటుడు ఎస్వీ రంగారావు తెలుగు ప్రజలు గర్వించదగ్గ నటుడని చెప్పారు. ఈ వేడుకల్లో సత్య హరిశ్చంద్ర (జూనియర్ డీవీ సుబ్బారావు), సత్యహరిశ్చంద్ర కాటిసీను (బండారు పద్మ), సత్యహరిశ్చంద్ర అడవిఘట్టం (మిట్నసల శాంతారావు)లచే ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు గుండ్రెడ్డి బాలాజీరావు తెలిపారు.

వందల కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చి పెడుతున్న గ్రానైట్ పరిశ్రమను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. కన్సిడరేషన్ అమౌంట్‌తో పాటు గ్రానైట్ స్లాబ్ సిస్టం ద్వారా కూడా మరో 50 శాతం రాయితీ ఇచ్చి పరిశ్రమలకు ఊపిరి పోస్తోంది. 12.5 శాతం కట్టాల్సిన డెవలప్‌మెంట్ మినరల్ ఫండ్, మెరిట్ చార్జీలను కూడా మినహాయిస్తూ ఆ జీవోను విడుదల చేసింది. అయితే ఇతర దేశాలకు ఎగుమతులు నిలిచి గ్రానైట్ నిల్వలు పేరుకుపోతే ఆ నెపాన్ని రాష్ట్ర ప్రభుత్వంపై నెడుతూ పచ్చమీడియాలో అసత్య కథనాలు వండివారుస్తున్నారు. రాజకీయంగా దిగజారిపోతున్న టీడీపీ ప్రతిష్టను జాకీలు పెట్టి లేపే పనిలో ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు.

గ్రానైట్ పరిశ్రమకు రాయితీలతో ఊపిరి



- ఫ్యాక్టరీలకు ప్రతి క్యూబిక్ మీటరుకు రూ.4 వేలు చొప్పున రాయితీ ఇచ్చి ఆదుకుంటున్న వైనం
- ఇక్కడ నుంచి చైనా, తైవాన్‌కు గెలాక్సీ గ్రానైట్ ఎగుమతి
- కోవిడ్‌తో ఆర్థిక మాంద్యం వల్ల గ్రానైట్ వైపు చూడని చైనా
- నెలకు 40 వేల మీటర్ల ఎగుమతులు కాస్తా 20 వేల మీటర్లకు తగ్గిపోయిన పరిస్థితి
- గ్రానైట్ క్వారీల్లో ఎగుమతులు లేకపోవటంతో 60 వేల క్యూబిక్ మీటర్ల నిల్వలు
- ఎగుమతులు లేకపోతే ఆ నెపాన్ని జగన్ ప్రభుత్వం మీదకు నెట్టే కుయుక్తి
- క్వారీలపై వికృత స్వారీ అంటూ పచ్చమీడియాలో వండివార్చిన కథనం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గెలాక్సీ గ్రానైట్‌కు జిల్లా పెట్టింది పేరు. అంతటి ప్రఖ్యాతి గాంచిన గ్రానైట్ క్వారీలకు, పరిశ్రమలకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీలు ఇచ్చి మరీ ఆదుకుంటోంది. కన్సిడరేషన్ అమౌంట్ పేరుమీద ప్రతి క్యూబిక్ మీటరుకు 50 శాతం రాయితీ ఇచ్చి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తోంది. కన్సిడరేషన్ అమౌంట్‌తో పాటు గ్రానైట్ స్లాబ్ సిస్టం ద్వారా కూడా మరో 50 శాతం రాయితీ ఇచ్చి పరిశ్రమలకు ఊపిరి పోస్తోంది. విదేశీ మారక ద్రవ్యంతో పాటు రాయల్టీ రూపంలో వందల కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చి పెడుతున్న గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలన్నదే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఏకైక లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న గ్రానైట్ పరిశ్రమ పదికాలాల పాటు మనుగడ సాగించాలంటే ప్రోత్సాహకాలు అందించి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే పచ్చ పత్రికలు, పచ్చ మీడియా ప్రభుత్వం మీద అసత్య కథనాలు గుప్పిస్తున్నాయి.

కన్సిడరేషన్ అమౌంట్‌తోపాటు ఇతరాలు కలిపి 50 శాతానికి పైగా రాయితీ...

సాధారణంగా ప్రతి మినరల్‌కు సీనరేజ్‌ని చెల్లించాలి. గ్రానైట్, క్వార్ట్జ్, ఇసుక, కంకర ఇలా అనేక రకాల మినరల్స్‌కు సీనరేజ్ చెల్లించాల్సి ఉంది. అయితే ప్రతి యూనిట్‌కు లేక క్యూబిక్ మీటరుకు రూ.100 సీనరేజ్ ఉంటే అదనంగా మరో రూ.100 కన్సిడరేషన్ అమౌంట్ ప్రభుత్వానికి చెల్లించాలి. అన్ని రకాల మినరల్స్‌కు ఇదే విధానాన్ని అమలు చేసుకుంటూ వస్తున్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2021 జూన్ 7వ తేదీన జీవో ఎంఎస్ నంబర్–42 విడుదల చేశారు. ఆ జీవో ప్రకారం అదనంగా కట్టాల్సిన కన్సిడరేషన్ అమౌంట్‌లో 50 శాతం రాయితీ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ 50 శాతం రాయితీతో పాటు 12.5 శాతం కట్టాల్సిన డెవలప్‌మెంట్ మినరల్ ఫండ్, మెరిట్ చార్జీలను కూడా మినహాయిస్తూ ఆ జీవోను విడుదల చేశారు. అంటే దాదాపు ఒక్కో క్యూబిక్ మీటరుకు అన్ని లెక్కలు వేస్తే దాదాపు రూ.4 వేల వరకు గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులకు ఆదాయం సమకూరుతోంది.

సాధారణ తనిఖీలు చేస్తే వేధింపులా...

సాధారణంగా ప్రతి సంవత్సరం సేఫ్టీ నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని గ్రానైట్ విభాగం, గ్రానైట్ విజిలెన్స్ విభాగాలు సంయుక్తంగా తనిఖీలు చేపడతారు. సేఫ్టీ నిబంధనలతో పాటు క్వారీల్లో ఉత్పత్తి తీరు, సరిహద్దుల సమస్యలు, సంరక్షణ చర్యల్లో భాగంగా తనిఖీలు సర్వసాధారణం. ఆ విధంగా టీడీపీ ప్రభుత్వంలో కూడా విచ్చలవిడిగానే చేపట్టారు. ఆ ప్రభుత్వంతో పోల్చుకుంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే చాలా తక్కువగా చేస్తున్నారు. లీజుదారులు సరైన క్రమంలో క్వారీలు చేస్తున్నారా...లేక క్వారీ లీజు అనుమతుల కంటే ఎక్కువ గెలాక్సీ గ్రానైట్ రవాణా చేస్తున్నారా అని అన్ని రకాల అంశాలపై తనిఖీలు చేపట్టడం సర్వ సాధారణం. అదేవిధంగా ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలు వసూలు చేస్తున్నారు. ఇలాంటి తనిఖీలు క్వారీల నియంత్రణలో భాగంగా ఎప్పుడూ జరిగేవే. అలాంటి వాటిని పచ్చ పత్రికలు ''క్వారీలపై వికృత స్వారీ'' పేరిట ప్రభుత్వంపై బురద జల్లే కార్యక్రమానికి పూనుకున్నారు.

60 వేల క్యూబిక్ మీటర్లకు పైగా గ్రానైట్ నిల్వలు:

విదేశీ ఎగుమతులు మందగించటంతో చీమకుర్తి గ్రానైట్ క్వారీల్లో దాదాపు 60 వేల క్యూబిక్ మీటర్లకు పైగా నిల్వలు ఎగుమతులకు సిద్ధంగా ఉన్నాయి. ప్రతి సంవత్సరం 40 వేల క్యూబిక్ మీటర్లకు పైగా గ్రానైట్ ఎగుమతి అవుతోంది. అయితే గెలాక్సీ గ్రానైట్ ఎక్కువ శాతం అంటే ఎగుమతుల్లో 70 శాతం ముడి గ్రానైట్ రాయి చైనాకు ఎగుమతి చేస్తారు. 10 శాతం తైవాన్‌కు ఎగుమతి అవుతోంది. ఒక సంవత్సరం నుంచి చైనా కోవిడ్‌తో విలవిల్లాడుతోంది. దీంతో ఆర్థిక మాంద్యంతో కొట్టుమిట్టాడుతోంది. అందువల్ల గ్రానైట్ ఎగుమతులకు భారీ షాక్ కొట్టింది. మిగతా 20 శాతం వెస్ట్ జర్మనీ, యూరప్ దేశాలకు పాలిష్డ్ గెలాక్సీ ఎగుమతి అవుతోంది. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లో గతంలో ఉన్న ధరల కంటే 48 శాతం పడిపోయాయి. అందువల్ల క్వారీల యజమానులు ఎగుమతులను నష్టాలకు చేయలేమని ఆపేశారు. దీనిని ప్రభుత్వం మీద బురద జల్లే కార్యక్రమానికి పూనుకున్నారు పచ్చ మీడియా.

ఎగుమతులు లేకపోవటమే ప్రధానం



ఎగుమతులు లేకపోవటమే ఆదాయం పడిపోవటానికి ప్రధాన కారణం. 70 శాతానికి పైగా దిగుమతి చేసుకునే చైనా ఆర్థిక మాంద్యంతో కొట్టుమిట్టాడుతోంది. క్వారీల మంజూరులో పారదర్శకత పాటిస్తున్నాం. క్వారీల్లో రక్షణ చర్యల విషయంలో రాజీ పడేదే లేదు. కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించాలి. సేఫ్టీ మెజర్స్ పాటిస్తున్నారా లేదా అన్నది నిత్యం పరిశీలించాల్సిందే. ప్రభుత్వం గ్రానైట్ పరిశ్రమకు రాయితీలు ఇచ్చి ఆదుకుంటోంది. ఉపాధి అవకాశాలను పెంపొందిస్తూ వస్తోంది. కానీ కొన్ని పత్రికలు క్వారీలపై వికృత స్వారీ అని రాయటం, క్వారీలకు రాజకీయ గ్రహణం పట్టుకుంది అని రాయటం అవాస్తవం. సత్యదూరపు వార్తలు రాసి గ్రానైట్ శాఖ అప్రతిష్ట పాలు చేయాలని చూడటం సరైన పద్ధతి కాదు.

– బి.జగన్నాథరావు, డిప్యూటీ డైరెక్టర్, జిల్లా భూగర్భ గనుల శాఖ

కన్సిడరేషన్ ఫీజు తగ్గింపుతో గ్రానైట్ పరిశ్రమకు ఊరట



రాష్ట్ర ప్రభుత్వం గ్రానైట్ పరిశ్రమపై కన్సిడరేషన్ ఫీజు 50 శాతం తగ్గింపుతో గ్రానైట్ యజమానులకు పెద్ద ఊరట లభించింది. దానితోపాటు మినరల్ డెవలప్‌మెంట్ ఫండ్‌లో కూడా ఇచ్చిన రాయితీ గ్రానైట్ వ్యాపారులకు మేలు చేసింది. ఒక్కో క్యూబిక్ మీటర్‌కు సరాసరిన రూ.2500 నుంచి రూ.3 వేల వరకు తగ్గింపు ఉంటుంది. ఒక్కో క్వారీ నుంచి నెలకు ఒక్కో క్యూబిక్ మీటర్‌కు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు తగ్గింపు వస్తుంది.

– శిద్దా హనుమంతురావు, కృష్ణసాయి గ్రానైట్ యజమాని

పథకాల్లో కలికితురాయి జగనన్న సురక్ష

- ఇప్పటికే 99.5 శాతం పథకాలను అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- మిగిలిన అరశాతం అమలు కోసమే జగనన్న సురక్ష పథకం
- పథకాన్ని ప్రారంభించిన మంత్రి ఆదిమూలపు సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్



సర్టిఫికెట్లను అందజేస్తున్న మంత్రి సురేష్

పెద్దదోర్నాల: రాష్ట్రంలో అమలవుతున్న పథకాల పరంపరలో మరో కలికితురాయి జగనన్న సురక్ష పథకమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని 1వ సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల కాలంలో ప్రజలకు ఏం చేశామో తెలియచెప్పేందుకు మీ ముందుకు వస్తున్నామని అన్నారు. పరిపాలనలో నూతన ఒరవడిని జగన్‌మోహన్‌రెడ్డి సృష్టించారన్నారు. వైఎస్ జగన్ అధికారం చేపట్టాక తానిచ్చిన మాట ప్రకారం 99.5 శాతం పథకాలు అమలు చేశారని, మిగిలిన అర శాతం భర్తీ చేయటానికి ఈ సరికొత్త పథకాన్ని ప్రారంభించారని చెప్పారు. గత టీడీపీ హయాంలో ఎన్నికలకు ముందు మాత్రమే నాయకులు ప్రజల వద్దకు వచ్చేవారని, ఆ తరువాత మళ్లీ కనిపించరని విమర్శించారు. పారదర్శకత, జవాబుదారితనం, అవినీతి రహిత, సమర్థత ఉన్న సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనలో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించే క్రమంలో ఎంతో అవినీతికి పాల్పడిందని విమర్శించారు. జగనన్న పాలనలో అటువంటి పరిస్థితి లేకుండా అర్హతే ప్రామాణికంగా తీసుకొని రూ.2.16 లక్షల కోట్లు లబ్ధిదారులకు ముఖ్యంగా మహిళల అకౌంట్లలోకి నేరుగా బదిలీ చేశారని కొనియాడారు. ఈ పథకాలను చూసిన ప్రతిపక్షాలు అవినీతి జరిగిందని గగ్గోలు పెడుతున్నాయన్నారు. రాష్ట్రాన్ని దివాళా తీస్తున్నారని, ఈ పథకాల వలన అభివృద్ధి జరగదని చెప్పిన వారు ఇప్పుడు ఎన్నికలు దగ్గరపడుతుండటంతో అటువంటి పథకాలను తాము కూడా అమలు చేస్తామని చెప్పకుంటూ తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. తాను ముఖ్యమంత్రిగా గెలవలేనని, సంఖ్యా బలంలేదని, నేను అసెంబ్లీలో ఎంటర్ అయితే చాలని, అంతకంటే ఎక్కువ అవసరం లేదని చెప్తున్న పవన్‌కల్యాణ్‌ను ప్రజలు ఏ విధంగా నమ్ముతారని ఆయన ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 2.50 లక్షల మంది వాలంటీర్లు, 1లక్షా 60 వేల మంది సచివాలయ సిబ్బంది, 15 వేలకు పైగా సచివాలయాలతో సరికొత్త పరిపాలన సాగుతుందని కొనియాడారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో 127 మందికి పలు రకాల సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ సాయికుమార్, ఎంపీడీఓ విజయ, మేజర్ పంచాయతీ సర్పంచ్ చిత్తూరి హారిక, వ్యవసాయ పరపతి సంఘ అధ్యక్షుడు వెన్నా కాశిరెడ్డి, చిన్నగుడిపాడు సర్పంచ్ పవన్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు గంటా వెంకట రమణారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ గుండారెడ్డి రమణారెడ్డి, మండల నాయకులు గుమ్మా యల్లేష్, లాలూనాయక్, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, బొగ్గరపు రమేష్, దూదేకుల రసూల్, చిట్యాల యోగిరెడ్డి, యక్కంటి మల్లారెడ్డి, దూదేకుల దర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సంక్షేమ పథకాలు చేరువ



సచివాలయంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

- కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్

ఒంగోలు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలతో పాటు ఉచిత ప్రభుత్వ సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్, మేజిస్ట్రేట్ ఏఎస్.దినేష్‌కుమార్ అన్నారు. త్రోవగుంటలోని 1వ డివిజన్ సచివాలయ పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా త్రోవగుంట సచివాలయ పరిధిలో శనివారం ఒక్కరోజే 294 సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. 11 రకాల సర్టిఫికెట్‌లను ఉచితంగా దరఖాస్తు చేసిన వెంటనే ఇవ్వడం గొప్ప విషయమన్నారు. ఏడు రోజులుగా వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి గృహాన్ని సందర్శించి అర్హత ఉండి కూడా ఎలాంటి లబ్ధి పొందనివారిని గుర్తించడం, వారి దగ్గర పథకాలు, సేవలకు సంబంధించిన పత్రాలను సేకరించి సచివాలయంలో రిజిస్ట్రేషన్ టోకెన్‌ను అర్జీదారులకు అందించామని కలెక్టర్ తెలిపారు. సచివాలయ, వాలంటరీ వ్యవస్థ వచ్చిన తరువాత ప్రభుత్వ సేవలు లబ్ధిదారుల గృహాల ముందే అందుతున్నాయన్నారు. వలస వెళ్లిన వారిని వలంటీర్లు గుర్తించి ఫోన్ ద్వారా తగు సమాచారం పొందాలన్నారు. పథకాలు ఆగిపోయినవారు పరిశీలనలో భాగంగా ఆగిందా, సంకేతిక కారణాల వల్ల ఆగిందా తెలుసుకుని సాంకేతిక కారణాలవల్ల ఆగిన పథకాలు వారికి వెంటనే అందిస్తామని చెప్పారు. సంవత్సరానికి రెండు పర్యాయాలు, జూన్, జూలై, డిసెంబరు, జనవరి నెలల్లో ప్రభుత్వ పథకాలు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. సచివాలయ సిబ్బంది, వాలంటీర్ సమన్వయంతో పనిచేయాలని, అర్హత ఉన్న వారికి లబ్ధి చేకూర్చాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అర్హులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జీఎస్.డబ్ల్యూ అధికారి ఉషారాణి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఆర్డీవో విశ్వేశ్వరరావు, తహసీల్దార్ మురళి, సచివాలయ అడ్మిన్ విజయలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మెడికల్ హబ్ ఏర్పాటు చేసేందుకు 3 ఎకరాల స్థలాన్ని ఒంగోలు మండలంలోని ముక్తినూతలపాడు గ్రామ పరిధిలో ఉన్న ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో విశ్వేశ్వరరావు, ఒంగోలు మండల తహసీల్దార్ పి.మురళి, సర్వేయర్లు విజయ శాంతి ఉన్నారు.

వాతావరణ మార్పులపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: వాతావరణంలో మార్పు తద్వారా మానవ ఆరోగ్యంపై కలిగే ప్రభావాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం ప్రకాశం భవనంలో వాతావరణ మార్పు, మానవ ఆరోగ్యం జాతీయ కార్యక్రమంపై టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మానవ శ్రేయస్సు, ఆరోగ్యాలకు ముప్పు కలిగించే వాతావరణ ప్రాముఖ్యతను వివరించారు. వాతావరణంలో వచ్చే మార్పులపై మాట్లాడుతూ కరువు, వరదలు, ఓజోన్ కాలుష్యం ప్రభావాలు, వాయు కాలుష్యం, అతినీల లోహిత వికిరణం, వెక్టర్ జనం, నీరు, ఆహారం ద్వారా పుట్టిన వ్యాధులు, గాలిలో పుట్టే వ్యాధులు తదితర అంశాలపై వివరించారు. డెంగీ, శ్వాసకోస అలర్జీలు, ఎస్టోస్పైరోసిస్, పోషకాహార లోపం, డయేరియా తదితర అంశాలకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వీటన్నింటిపై ప్రజలకు ముమ్మరంగా అవగాహన కల్పించాలన్నారు. దీనిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరుమలరావు, డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ సుధాకర్, ఇతర అధికారులు శివగోపాల్, భాగీరథి, వాణిశ్రీ, ఒనోగ్లే ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

క్లుప్తంగా

పంటల బీమా పరిహారం మంజూరు

- ఆర్‌బీకేల్లో జాబితాలను సరిచూసుకోవాలి
- అభ్యంతరాలుంటే 4వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా తెలపాలి
- జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

ఒంగోలు సబర్బన్: డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా–ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద జిల్లాలోని రైతులకు పరిహారం మంజూరైందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఆ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. ఉచిత పంటల బీమా ద్వారా 2022 ఖరీఫ్ పంట కాలానికి దిగుబడి ఆధారిత పథకం కింద జిల్లాలోని 56,778 మంది రైతులకు పరిహారం మంజూరైంది. ప్రాథమికంగా రూ.172.22 కోట్లు మంజూరవగా, అందులో కంది పంటకు అత్యధికంగా రూ.175.45 కోట్లు మంజూరైంది. వరి పంటకు రూ.0.50 కోట్లు, సజ్జ పంటకు రూ.0.27 కోట్లు మంజూరైంది. వాతావరణ ఆధారిత బీమా పథకం కింద 16,777 మంది రైతులకు ప్రాథమికంగా రూ.8.80 కోట్ల బీమా పరిహారం మంజూరైంది. అందులో పత్తి పంటకు రూ.8.77 కోట్లు, ఎండు మిర్చికి రూ.0.03 కోట్లు మంజూరైంది. అందుకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాలను సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించారు. రైతులు ఆ జాబితాలను సరిచూసుకుని ఏమైనా అభ్యంతరాలుంటే వెంటనే సంబంధిత రైతు భరోసా కేంద్రం సిబ్బందిని సంప్రదించాలి. ఈ నెల 4వ తేదీ సాయంత్రం 4 గంటల్లోగా అభ్యంతరాలు తెలియజేయాలి.

పోలీసుల సంక్షేమం దిశగా చర్యలు

- వారి తల్లిదండ్రుల సంక్షేమానికి ప్రతి మండలంలో సమావేశాలు
- ఎస్పీ మలికాగర్గ్


పోలీసుల కుటుంబాలతో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: పోలీసు సిబ్బంది తల్లిదండ్రుల సంక్షేమానికి ప్రతి మండలంలో సంక్షేమ సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. స్థానిక పోలీసు కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన పోలీసు వెల్ఫేర్ కమిటీ సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. పోలీసు శాఖలో పనిభారం ఎక్కువగా ఉంటుందని, సుదూర ప్రాంతాల్లో పోస్టింగులు, నైట్ డ్యూటీలు, బందోబస్తు వంటి విధుల వలన తల్లిదండ్రులతో కలిసి ఉండే అవకాశాలు తక్కువగా ఉంటాయని ఎస్పీ అన్నారు. తల్లిదండ్రుల బాగోగులు చూసుకోలేక పోలీసు సిబ్బంది ఇబ్బంది పడుతుంటారని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా ఒంటరిగా నివసిస్తున్న పోలీసు సిబ్బంది తల్లిదండ్రులను గుర్తించి వారితో సంక్షేమ సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. తల్లిదండ్రుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. వారి ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రాథమిక దశలో అనారోగ్య సమస్యలను గుర్తించి సకాలంలో తగిన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వృద్ధాప్యంలో తలెత్తే సమస్యలు తెలుసుకుని వైద్య సలహాలతో పాటు అవసరమైన వారికి ఔషధాలు అందించడం జరుగుతుందన్నారు. పోలీసు సిబ్బంది మరింత క్రియాశీలకంగా విధులు నిర్వహించేందుకు అవసరమైన అన్నిరకాల చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసుల కుటుంబ సభ్యుల భద్రత, ఆరోగ్య సంక్షేమానికి చర్యలు తీసుకోవడం ద్వారా సిబ్బందిలో ఒత్తిడి తగ్గించి, ఆందోళనను దూరం చేసి ప్రజలకు వారు మరింత మెరుగ్గా సేవలందించేలా చేయడమే ప్రధాన లక్ష్యమని ఎస్పీ వివరించారు. సిబ్బంది తల్లిదండ్రులు ఏవైనా సమస్యలుంటే తక్షణ సహాయం కోసం అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ, వెల్ఫేర్ ఆర్ఐ, గ్రామ వార్డు సచివాలయ మహిళా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఆర్ఐ వెల్ఫేర్ శ్రీహరిబాబు (9121102221)ను సంప్రదించాలని కోరారు.

పోలీసుల కుటుంబ సభ్యులకు ఎస్పీ కుశల ప్రశ్నలు...

అమ్మా ఎలా ఉన్నారు.. ఆరోగ్యం ఎలా ఉంది..? మనమళ్లు, మనుమరాళ్లు బాగున్నారు కదా.. వారు ఏం చదువుకుంటున్నారు..? అంటూ ఎస్పీ మలికాగర్గ్ పోలీసు సిబ్బంది తల్లిదండ్రులను ఆప్యాయంగా పలకరించారు. మీరు ఒంటరివారు కాదు.. నన్ను మీ బిడ్డలా భావించండి.. మనమంతా పోలీసు కుటుంబానికి చెందినవాళ్లం. మీకెలాంటి సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకురండి అంటూ భరోసా ఇచ్చారు. ఆరోగ్యంపై పలు సలహాలు, సూచనలు చేశారు. దీంతో పోలీసుల వెల్ఫేర్ కమిటీ సమావేశానికి వచ్చిన పోలీసుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన, ఏఎస్పీ అడ్మిన్ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, పోలీసు యూనిట్ డాక్టర్ భానుమతి, సీఐలు రాంబాబు, టి.వెంకటేశ్వర్లు, జగదీష్, డీసీఆర్బీ సీఐ ధర్మేంద్ర, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ న్యాయం


బండ్లమూడిలో సర్టిఫికెట్లు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

- జగనన్న సురక్ష కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. చీమకుర్తి మండలంలోని కూనంనేనివారిపాలెం, బండ్లమూడి గ్రామాలతో పాటు చీమకుర్తి మున్సిపాలిటీలోని 1, 2 సచివాలయాల పరిధిలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతిక కారణాల వలన, పథకాల మంజూరుకు అవసరమైన సర్టిఫికెట్లు లేకపోవడం వలన పథకాలు ఆగిపోయిన వారికి కూడా అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెల రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని సంక్షేమ పథకాలు ఆగిపోయిన వారు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాలు అందించేందుకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను జగనన్న సురక్ష కార్యక్రమంలో అందిస్తున్నట్లు తెలిపారు. సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు సర్టిఫికెట్లు అవసరమైన వారికి తగిన సూచనలిస్తారని, వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లో సచివాలయ సిబ్బంది సిద్ధం చేసిన సర్టిఫికెట్లను జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నలమల మాణిక్యం, కౌన్సిలర్లు బీమన వెంకట్రావు, తప్పెట బాబూరావు, గోగినేని అనసూర్యమ్మ, వైఎస్సార్ సీపీ రూరల్ మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థతో సమన్వయం అవసరం

- పోలీసు అధికారులతో ఎస్పీ మలికాగర్గ్


మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు టౌన్: నేరస్తులకు కచ్చితంగా శిక్ష పడేందుకు న్యాయ వ్యవస్థలోని అధికారులతో పోలీసు అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఎస్పీ మలికాగర్గ్ సూచించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పీపీలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆయా కోర్టుల పరిధిలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్లను సంప్రదించిన తర్వాతే చార్జిషీట్లు దాఖలు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. నిందితులకు సంబంధించిన వారెంట్లు, సమన్లను సత్వరమే అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోర్టు సమాచారాన్ని ఎప్పటికప్పుడు స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు తెలియజేయాలన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సూచనలు, సలహాలు పాటించాలని చెప్పారు. బాధితుల నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా కేసుల్లో నిందితులకు శిక్షలు పడే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకున్నప్పుడే బాధితులకు న్యాయం జరుగుతుందని చెప్పారు. పోలీసు అధికారులు నిరంతరం పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని పరిశీలిస్తూ ఉన్నతాధికారుల సూచనల ప్రకారం కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కోర్టు లైజన్ సిబ్బంది పోలీసుస్టేషన్‌కు, న్యాయస్థానాలకు మధ్య అనుసంధానకర్తగా వ్యవహరించాలని చెప్పారు. శిక్షల శాతం పెరిగినప్పుడే నేరాల శాతం తగ్గుతుందని స్పష్టం చేశారు. పోలీసు, న్యాయ వ్యవస్థలు సమన్వయంగా పనిచేసి బాధితులకు న్యాయం చేకూర్చినప్పుడే ఇరు వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం కలుగుతుందన్నారు. కోర్టులో సీడీ ఫైల్స్ దాఖలు చేయడం, నిందితులకు సంబంధించిన వారెంట్లు, సమన్లను అమలు పరచడం, కోర్టు వాయిదాలకు సరైన సమయంలో సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టడం, సాక్ష్యులకు ముందే బ్రీఫింగ్ చేయడం గురించి పలు సూచనలు చేశారు. అనంతరం కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు అనేక సందేహాలను డిప్యూటీ ప్రాసిక్యూషన్ శ్రీనివాసమూర్తి నివృత్తి చేశారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అంకితా సురాన, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైమ్) శ్రీధర్‌రావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, డీఎస్పీలు వి.నారాయణస్వామిరెడ్డి, రామరాజు, అశోక్‌వర్ధన్, వీరరాఘవరెడ్డి, శ్రీనివాసులు, డీసీఆర్బీ సీఐ ధర్మేందర్, లీగల్ అడ్వైజర్ వేణుగోపాల్, పీపీ వసుంధర తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధం వలనే హత్యాయత్నం

- గోవిందమ్మ కుమార్తె ప్రసన్న అడ్డుగా ఉందనే హత్యకు కుట్ర
- తలపై రాడ్డుతో బాది చనిపోయిందని పారిపోయిన సాయిరాం
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు


ఎస్సై రామకృష్ణ

దర్శి: పట్టణంలో శుక్రవారం ఉదయం తల్లీకూతుళ్లపై జరిగిన హత్యాయత్నానికి వివాహేతర సంబంధమే కారణమని స్థానిక ఎస్సై రామకృష్ణ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. దర్శికి చెందిన పెద్దిశెట్టి సాయిరాం అలియాస్ వెంకటప్రభు శేషసాయి స్థానికంగా నివాసం ఉంటున్న గోవిందమ్మ అనే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో కొద్దిరోజుల నుంచి గోవిందమ్మతో పాటు ఆమె కుమార్తె ప్రసన్నను తిడుతూ కొడుతూ ఉన్నాడు. ఇంటికి రావద్దని వారు చెప్పినా వినకుండా వేధిస్తున్నాడు. తన తల్లిని బాధపెట్టడాన్ని భరించలేకపోయిన ప్రసన్న.. ఇంకోసారి ఇంటికి వచ్చి తమతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే పోలీస్‌స్టేషన్‌లో కేసు పెడతామని హెచ్చరించింది. గోవిందమ్మతో తన వివాహేతర సంబంధానికి ప్రసన్నను అడ్డు తొలగించుకోవాలని కుట్ర పన్నిన సాయిరాం.. శుక్రవారం ఉదయం ఇంటి బయట మంచంపై పడుకుని ఉన్న ప్రసన్న తలపై రాడ్డుతో విచక్షణా రహితంగా 8 సార్లు బాది చనిపోయిందని భావించి వెళ్లిపోయాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

ఏడుగురిపై పిచ్చికుక్క దాడి

కొమరోలు: ఏడుగురిపై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మండలంలోని హనుమంతరాయునిపల్లె గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. ఆరుబయట నిద్రిస్తున్న ఏడుగురిపై పిచ్చికుక్క ఒక్కసారిగా దాడి చేసింది. ప్రజలతోపాటు వీధికుక్కలు, పశువులను కూడా కరిచింది. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటనతో గ్రామస్తులు బెంబేలెత్తిపోయారు.

ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ దినేష్‌కుమార్


ఒంగోలు అర్బన్: వీధి వ్యాపారులు ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించి ప్రజలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. శనివారం స్థానిక స్పందన భవనంలో మెప్మా ఆధ్వర్యంలో నెస్లే కంపెనీ సహకారంతో ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా ఫుడ్ సేఫ్టీపై శిక్షణ తరగతులు నిర్వహించారు. కలెక్టర్ హాజరై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోజుకు వంద మంది చొప్పున వీధి వ్యాపారులకు ఈ నెల 1 నుంచి 4వ తేదీ వరకు 400 మందికి ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్లు అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆహార భద్రత అధికారి గరికపాటి ప్రభాకర్‌రావు, మెప్మా పీడీ రవికుమార్, అధికారులు వసీమ్ అహ్మద్, బి.నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన ఉన్న సీట్లను మెరిట్ ఆధారంగా భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కో ఆర్డినేటర్ డి.జయ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4వ తేదీ ఉదయం 10 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల, దర్శిలో బాలురకు, ఈ నెల 5వ తేదీ ఉదయం 10 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల, సింగరాయకొండలో బాలికలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. 2023లో పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు ఒరిజినల్ మార్కుల జాబితాలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని, పూర్తి సమాచారానికి సంబంధిత కాలేజీలను సంప్రదించాలని సూచించారు.

బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్

- ప్రారంభించిన పశుసంవర్ధకశాఖ జేడీ బేబీరాణి


ఫారంలో ఆడదూడలను పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ జేడీ బేబీరాణి

మద్దిపాడు: పాడి పశువుల్లో బ్రూసెల్లోసిస్ వ్యాధి రాకుండా టీకాలు వేసే కార్యక్రమాన్ని జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ కె.బేబీరాణి శనివారం మద్దిపాడులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రూసెల్లోసిస్ వ్యాధి బారిన పడిన దున్నపోతులతో పొర్లించడం వలన ఈ వ్యాధి సోకుతుందని తెలిపారు. ఈ వ్యాధి సోకిన పశువుల్లో గర్భకోశ వ్యాధులు వస్తాయన్నారు. ముఖ్యంగా ఈసుకుపోవడం, కట్టు నిలవకపోవడం, పశువులు గొడ్డుబోతుగా మారడం జరుగుతుందన్నారు. ఈ వ్యాధి ఒక పశువు నుంచి వేరే పశువుకు, మనుషులకు కూడా సోకే ప్రమాదం ఉందని తెలిపారు. అందువలన పశువులకు కృత్రిమ గర్భోత్పత్తి చేయించుకోవాలని, పశువైద్యాధికారి సూచనలు, సలహాలు పాటించాలని పాడి రైతులకు సూచించారు. మొదటి ఫేజ్‌లో ఐదు దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి టీకాలు వేశారు. ఫాడర్ ప్లాంట్లను పరిశీలించి పశుగ్రాసాలపై పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం స్థానిక ఏడీ కార్యాలయంలో సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డీడీ డాక్టర్ రమేష్‌బాబు, సహాయ సంచాలకులు డాక్టర్ పి.రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.